కథ

శ్రీపతి మాస్టారు తనకు రావాల్సిన పెన్షను కోసం ఆఫీసుకెళ్ళాడు. అక్కడ క్లర్కు దినపత్రికని రెండు చేతుల్తో ఎత్తి పట్టుకుని సీరియస్‌గా చదువుతున్నాడు. పేపర్లో పెద్ద పెద్ద అక్షరాల్లో- 'ఇకపై నెల నెలా పెన్షన్ల చెల్లింపులు, కమీషనర్ వెల్లడి!' ప్రకటన చదవగానే శ్రీపతికి నవ్వొచ్చింది. ఆ తర్వాత తన దుస్థితికి వేదన పెల్లుబికింది.

# తప్పెవరిది?

క్లర్కుని పిలిస్తే- కసురుకుంటాడని భయం. అలా అని అక్కడే నిలబడితే, అవతల కొడుక్కి కాలేజీ సీటుకోసం అర్జెంటుగా డబ్బుకావాలి.

ఏం చెయ్యాలో పాలుపోక పేపర్‌కేసి చూస్తూ ఆలోచనల్లో పడ్డాడు.

మొదట్లో పెన్షను సరిగానే వచ్చింది. తర్వాత ఆగిపోయింది. కారణం తెలీదు. కనుక్కుందామంటే- చెప్పే దిక్కులేదు. ఇంతలోనే భార్య అకస్మాత్తుగా చనిపోయింది. దాంతో కొన్ని నెలలు పెన్షన్ ఆఫీసుకెళ్ళలేదు.

ఆ తర్వాత వెళ్ళే రోజునే గుండెపోటు వచ్చింది. డాక్టర్లు విశ్రాంతి అవసరం అన్నారు. ఆ తంతూ పూర్తయి మూడు నెలల క్రిందట వెళ్తే, క్లర్కు శ్రీపతిని ఎగాదిగా చూసి-"ఈ ఆరు నెలలు ఏమైపోయారు?" విసుగ్గా ప్రశ్నించాడు.


జరిగిందంతా చెప్పాడతను. అన్నీ విని క్లర్కు మరింత విసుగ్గా-"భార్య పోయిందని, గుండెనొప్పని ఆలస్యం చేస్తే ఎట్లా మేస్టారూ! మీ పెన్షను పాత బకాయిలతో రావాలంటే ఎమ్మార్వో దగ్గర్నించి సర్టిఫికెట్ తేవాలి! వెళ్ళండి!" చెప్పాడు. శ్రీపతి అర్థం కానట్టు చూశాడు.

"పెన్షన్ రివైవల్ చెయ్యాలంటే మీరు సజీవంగా ఉన్నట్లు సర్టిఫికేటు అవసరం!" చెప్పేసి క్లర్కు కోపంగా సీట్లోంచి లేచెళ్ళిపోయాడు.

ఈ మానవుడింకా మరణించలేదన్న ధృవీకరణ పత్రాన్ని ఎమ్మార్వో, డాక్టరు సంయుక్తంగా సంతకాలు పెట్టి ఇవ్వాలి!

ఇక ఆ రోజు నుండి శ్రీపతి ఎమ్మార్వో ఆఫీసు ఎక్కడుందో తెలుసుకోలేక నానాతిప్పలు పడ్డాడు. ఏ సినిమాహాలు అడ్రసో, బార్ అడ్రసో అయితే తేలికగా దొరుకుతుంది కానీ, ఇలాంటి ప్రజోపకరమైన ఆఫీసు అడ్రసులు అంత తేలికగా దొరకవన్న సంగతి ఇరవై రోజులకి కానీ అర్థం కాలేదు.

ఊరికి దూరంగా ఎవరికీ అందుబాటులో లేకుండా ఆ ఆఫీసుని అక్కడ నిర్వహించమని ఎవరు ఆదేశాలు జారీచేశారో కనబడ్డ ప్రతివారినీ శ్రీపతి టీచర్లకుండే ఆసక్తి బుద్ధితో తరచి తరచి వాకబు చేశాడు.



జవాబు ఎవ్వరూ చెప్పలేకపోయారు కానీ ఎమ్మార్వో ఆఫీసు ఎదురుగా టీ బంకు నడిపే అతను మాత్రం "ఈ కొంప మాజీ ఎమ్మెల్యేగారి రెండో భార్యది సార్! ప్రతి నెలా గావుర్మెంటు ఆవిడకేనట అద్దె కట్టేది!" చెప్పి ఇంత చిన్న విషయం ఆఖరికి నేను చెప్పాల్సి వచ్చిందన్నట్టు చూశాడు.

అనేక అవసరాల రీత్యా ఎమ్మార్వో సంతకం కోసం ఎంతోమంది ప్రజలు అక్కడికొచ్చి వెళ్తున్నారు. బస్సు సౌకర్యం లేదు! అయినా విద్యార్థులు, ఆడవాళ్ళు, ముసలివాళ్లు-ఎందరో నెలల కొద్దీ ఓపికగా తిరుగుతూ పనులు జరుపుకుంటున్నారు కానీ- ఈ ఆఫీసేమిటి? దీని పని వేళలేమిటి? ఇది ఇక్కడెందుకుంది? లాంటి ప్రశ్నలు ఎవరూ వేసుకున్నట్టు శ్రీపతికి అనిపించ లేదు.

ముఖ్యంగా-అక్కడికెళ్ళినప్పుడల్లా కన్పించే ఓ వికలాంగుడు! అతని పరిస్థితి మరీ దారుణం! కిలోమీటర్ దూరంలో ఉన్న బస్టాపులో బస్సు దిగి నానా అవస్థలు పడుతూ కుంటుతూ నడిచి వస్తాడు.

"నీ పేరేంటి బాబూ!" ఓ రోజు శ్రీపతి అడిగాడు.

"రంగ ప్రసాదు సార్! వికలాంగుడి కోటాలో స్వయం ఉపాధి పథకం క్రింద రుణం ఇస్తారని తెలిసి ఎమ్మార్వో సంతకం కోసం తిరుగుతున్నాను సార్! కానీ ఎన్ని దినాలయినా పని జరగట్లే సార్!" దీనంగా చెప్పాడు.

ఇదే విషయాన్ని శ్రీపతి మరోసారి కొందరు కాలేజీ విద్యార్థుల దగ్గర ప్రస్తావించగా, వాళ్ళల్లో ఒకడు క్రాఫ్ స్టైల్‌గా దువ్వుతూ

"ఫైనల్ పారేస్తే పన్లయిపోతాయి సార్!" నిర్లక్ష్యంగా అన్నాడు.

మరో కుర్రాడు ఉద్రేకంతో ఊగిపోతూ "బాంబ్ పెట్టి బ్లాస్ట్ చేస్తేగానీ ఆఫీసుని సిటీలోకి షిఫ్ట్ చెయ్యరుసార్!" అన్నాడు.

ఆ సమాధానానికి శ్రీపతి తేరుకునే లోపలే- వెనక నుంచి ఎవరో మరో కుర్రాడు "మన పనులు అప్పుడుగానీ సక్రమంగా చెయ్యరు సార్!" అన్నాడు. ఇలా అన్నది ఎవరా అని శ్రీపతి వెనక్కి తిరిగి చూస్తే రంగప్రసాదు! సొట్టకాళ్ళతో నడవలేక నడుస్తూ దగ్గరికొచ్చి

"అవున్సార్! ఏదో ఒకరోజు నేను బాంబు తీసుకొచ్చి ఈ ఆఫీసు మీద వేస్తాను సార్!" అంటుంటే శ్రీపతి భయంగా చూశాడు.

ఇకపై ఎవ్వర్నీ ఏమీ ప్రశ్నించకూడదని గట్టిగా

వారణాసి రామకృష్ణ

అనుకుని తనక్కావాల్సిన సంతకాలు చేయించుకు న్నాడు.

శ్రీపతి గతంలోంచి బైటికొచ్చి చూస్తే- క్లర్కు ఇంకా పేపర్ చదువుతూనే వున్నాడు. ఇక తప్పదనుకొని మెల్లిగా-"సార్! మీరడిగిన సర్టిఫికెట్ తెచ్చాను సార్!" అన్నాడు.

క్లర్కు పేపర్లోంచి మొహం బైటపెట్టి "ఓహో! మీరా మాస్టారూ! సర్టిఫికెటు తెచ్చారా? వెరీగుడ్! కాస్సేపు ఆగండి! మా కమీషనరుగారు పేపర్లో ఓ ప్రకటన ఇచ్చారు. దాన్ని చదివాక మీ సంగతి చూస్తా!" అంటూ పేపర్ చదివాక- సర్టిఫికెట్‌ని పరిశీలనగా చూసి వెంటనే "ఇదేంటి మేస్టారూ! ఎమ్మార్వో చేత నిన్నటి తేదీ వేయించుకొచ్చారు?" అరిచాడు.

శ్రీపతి క్షణంబాటు గతుక్కుమని-"నిన్ననే కదా మరి ఆయన చేత సంతకం చేయించుకుంది!" అన్నాడు.

"అదెట్లా? మీరు ఆరు నెలల క్రిందటి తేదీతో సంతకం పెట్టించుకురావాలి! ఇట్లా చేస్తే ఎట్లా మేస్టారూ? మళ్ళీ ఫ్రెష్‌గా సర్టిఫికెట్ తెచ్చుకోండి! ఇది ఇంక పనికిరాదు" అంటూ దాన్ని చించేసి డస్ట్‌బిన్‌లోకి పారేశాడు.

శ్రీపతికి అమాంతం కోపం వచ్చింది.

"ఏమిటీ! నేను ఇప్పుడు బ్రతికే ఉన్నాను అంటే, ఆరునెలల క్రిందట కూడా బ్రతికున్నట్టే కదా' మళ్ళీ బ్యాక్ డేట్‌తో ప్రత్యేకంగా సంతకం చేయించాలా?" గట్టిగా అడిగాడు.

క్లర్కు విసుగ్గా మొహం పెట్టి-"చూడండి మేస్టారూ! తెలివితేటల/సమాధానాలతో అయ్యే పనులు కావివి! ఇక్కడ లెక్కలు, లాజిక్కులు పనికి రావు! రూల్స్ ప్రకారం పోవాల్సిందే!" అన్నాడు.

"ఇవేం తలతిక్క రూల్సయ్యా?" ఆవేశంగా ప్రశ్నించాడు.

"ఏమో నాకేం తెలుసు? పై అధికారులు, రూల్స్ ఫ్రేమ్ చేస్తారు! దానికి తగ్గట్టుగా నా బోటి గుమాస్తాలు నడుచుకోవాలే తప్ప- ఇవాళ నా ఎదురుగా నిలబడ్డ మ్మాలు టీచరుకి ఆరు నెలల క్రిందట బతికేవున్నట్టుగా సర్టిఫికెట్ ఏంటి? అని ఆలోచించాననుకోండి, మెంటల్‌గాణ్ణి అయిపోతాను. దాంతో వుద్యోగం వూడి పెళ్ళాం పిల్లలు రోడ్డున పడతారు!" కూల్‌గా నవ్వుతూ చెప్పాడు.

"అంటే నీకు పిచ్చి పట్టకుండా వుంటానికి పిచ్చి పిచ్చి రూల్సు ఫాలో అవుతావా?"

"అవి పిచ్చి రూల్సో, వెర్రిరూల్సో నాకెందుకు మేస్టారూ? మీకు మీ పెన్షన్ కావాలనుకుంటే బ్యాక్‌డేట్‌తో పత్రం పట్టుకురండి!" ఇక విసిగించకండి అన్నట్టు మొహం పెట్టి చెప్పాడు.

ఇంతలో అప్పుడే లోనికి వస్తున్న కమీషనరు మహాదేవ్ శ్రీపతిని చూసి ఆశ్చర్యంతో ఆగిపోయి "మీరా సార్!" నమ్మలేనట్టు చూశాడు.

శ్రీపతి అతన్ని పోల్చుకోలేక "మీరు..మీరు.." అంటుండగానే.

"నేనేసార్! మహాదేవ్‌ని" వినయంగా నమస్కరించి క్లర్కుతో, "వీరు నా చిన్నప్పటి లెక్కల టీచరు! వీరి చలవ వల్లే నేనివాళ ఈ పొజిషన్‌లో ఉన్నాను. తిండికి లేకపోతే ఎన్నోసార్లు టీచర్‌గారి భార్య అన్నం పెట్టింది!" అని శ్రీపతి వైపు తిరిగి

"సార్! అమ్మగారు క్షేమంగా ఉన్నారు కదా సార్!" అడుగుతుంటే శ్రీపతికి భార్య గుర్తొచ్చి కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాడు.

మహాదేవ్ ఆందోళనగా "అదేంటిసార్. అన్నపూర్ణమ్మగారు..." అర్థం అయినట్టు అర్థోక్తిలో ఆపాడు. శ్రీపతి దుఃఖం అణచుకుంటూ, తలవూపి

"అవునయ్యా! ఆమె పోయి ఆరు నెలలయింది!" చెప్పాడు.


"అయామ్ సారీ సార్! రండి! నా కేబిన్‌లో రిలాక్స్ అవుదురుగాని.." అంటూ తీసుకెళ్తుండగా- అద్దాల్లోంచి బైట వరండా కనిపించింది.

అక్కడ ఎంతోమంది వృద్ధులు పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. బ్రతుకు అంచున సమరాన్ని సాగిస్తూ, అనారోగ్యపు కోరల్లో నలిగిపోతూ రావాల్సిన పెన్షన్ డబ్బు చేతికందక టెన్షన్‌తో కృంగిపోతున్నారు.

క్లర్కు వచ్చి కమీషనర్‌తో ఏదో చెప్పి వెళ్ళాడు. వెంటనే అతను "మీ పెన్షన్ గురించి బాధపడకండి సార్! నేను చూసుకుంటాను" అన్నాడు.

శ్రీపతి గాఢంగా వూపిరి వదులుతూ "నా బాధ దాని గురించి కాదు! పెన్షనర్లు బ్రతికున్నా చచ్చిన వాళ్ళ క్రిందే లెక్క! అందుకే ఆరునెలలకోసారి ఇంకా పెన్షన్ తీసుకునేవాడు బ్రతికే ఉన్నాడో లేదోనని పరీక్షలు పెడుతున్నారు!" నిస్పృహగా అన్నాడు.

"మీ పెన్షన్ గురించి ఫీల్ కాకండి సార్!"




"నేను ఫీలవుతున్నది నా పర్సనల్ **ఫీలింగ్** గురించి కాదు! వ్యవస్థ పని తీరులోనే **తప్పు ఎక్కడు**. దానని ఆలోచిస్తున్నాను!"

అసహనంగా శ్రీపతి అనగానే మహాదేవ్ **తన** సీట్లోంచి లేచి అతని రెండు చేతులు **పట్టుకుని**. "ఛా..ఛా! ఇందులో మీ తప్పేం వుంది సార్! మా **డిపా**ర్ట్‌మెంట్ రూల్స్ అలా ఏడిశాయి! మీరేం వర్రీ కాకండి!" అన్నాడు. దాంతో శ్రీపతికి మరింత చిర్రెత్తుకొచ్చింది.

"నా వర్రీ నా ఒక్కడి పెన్షన్ గురించి కాదు మహాదేవ్! స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నించి టీచరు పని చేస్తూ అనేకమందికి చదువుచెప్పాను! నా దగ్గర చదువుకున్న వాళ్లల్లో చాలామంది ఎమ్మెల్యేలు, మినిస్టర్లు, పెద్ద పెద్ద అధికారులు అయ్యారు. అయితే వీళ్ళల్లో ఏ ఒక్కరూ కూడా పనికిరాకుండా పోయిన పాత చట్టాలను పాతర వెయ్యలేదు, వేసే ప్రయత్నం చెయ్యలేదు. కాలానుగుణంగా రూల్సు మార్చలేదు.

నా దగ్గర చదివిన వాళ్ళకి బుద్ధీ, జ్ఞానం అలవడి వుంటుందని మురిసిపోయాను. కానీ ఇలా పాతరెయ్యాల్సిన పాతరూల్సుని పట్టుకుని వ్రేలాడుతూ ప్రజల్ని హింసిస్తూ, ప్రజాపాలన చేస్తున్నారనుకోలేదు.

ఈ తప్పంతా నాది, నా బోటి టీచర్లది. మీది ఎంత మాత్రం కాదు! మిమ్మల్నింత పరాన్నభుక్కులుగా, మూర్ఖులుగా తయారుచేసిన మా తరం వాళ్ళదే ఈ తప్పంతా! మాతరం దీనికి బాధ్యత వహించాలి! కానీ..కానీ" తీవ్రమైన ఆవేశంతో చెప్తున్న శ్రీపతి ఆయాసంతో ఆగాడు.

అతని పరిస్థితి చూసి మహాదేవ్ భయంగా-"మంచినీళ్ళు త్రాగండిసార్! జరిగినవన్నీ మర్చిపోండి! రిలాక్సవ్వండి సార్!" అంటూ గ్లాసుతో నీళ్ళివ్వబోగా శ్రీపతికి మరింత ఆవేశం వచ్చింది.

"లేదు మహాదేవ్! నాకేమీ వద్దు! నన్ను చెప్పనివ్వు! దేశాన్ని మధ్యయుగాల వైపు తీసుకెళ్ళి అనాగరికులుగా మిమ్మల్ని తయారుచేసినందుకు, నూతన విద్యావ్యవస్థని నెలకొల్పి మీలో ఆధునీక భావాల్ని రేకెత్తించలేనందుకు మాకీ శిక్ష విధించారు! ఈ విధంగా పరిపాలన చేస్తూ మా కళ్ళు తెరిపించారు. అయితే- కనీసం మీరైనా, ఇప్పటికైనా కళ్ళు తెరిచి భావితరాలకీ దుస్థితి రాకుండా చూడండి! అలా చెయ్యకపోతే- నేటితరం మిమ్మల్ని క్షమించదు! హింసకి పూనుకొంటుంది. దేశం వినాశనాన్ని చవి చూస్తుంది. అవినీతిమయమైపోతుంది!"

ఆవేదనతో శ్రీపతి అరుస్తూ కుర్చీలోనే కుప్పకూలాడు.

*